క్లుప్తంగా

గోదావరి వద్ద వే బ్రిడ్జి!



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి వద్ద గోదావరి సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. అంబట్‌పల్లిలోని మేడిగడ్డ బరాజ్ దిగువన గోదావరి నుంచి ఇసుక క్వారీల గుండా వచ్చే లారీలను తూకం వేయడానికి నిర్మాణం చేశారు. దీనిపై రెవెన్యూ, మైనింగ్, తూనికలు కొలతల అధికారులు గమ్మున ఉండడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దేవాలయంలో హనుమత్ హోమం



భూపాలపల్లి అర్బన్: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని భక్తాంజనేయస్వామి దేవాలయంలో హనుమత్ హోమం నిర్వహించినట్లు ఈఓ మహేష్ తెలిపారు. రాష్ట్ర ప్రజల క్షేమం కోరుతూ హనుమత్ హోమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఈఓతోపాటు ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కొండచిలువ ప్రత్యక్షం



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ ఇంగ్లిష్ మీడియం ప్రైవేట్ పాఠశాల వద్దకు బుధవారం కొండచిలువ వచ్చింది. పాఠశాల యాజమాన్యం అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయుడు సముద్రతో కలిసి ఎఫ్‌బీఓ సదానందం కొండ చిలువను అటవీప్రాంతంలో వదిలిపెట్టారు. దీంతో యా జమాన్యం, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

నలుగురిపై కేసు నమోదు

రేగొండ: మొక్క జొన్న పంటను ధ్వంసం చేసిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని రేపాక గ్రామానికి చెందిన కుర్రె ఓదెమ్మ అనే రైతుకు అదే గ్రామానికి చెందిన మరో రైతు కుర్రె రవికి పాత కక్షలు ఉన్నాయి. పాత కక్షలు మనస్సులో ఉంచుకుని రవి అతని కుటుంబ సభ్యులు బుధవారం ఓదెమ్మకు చెందిన మొక్క జొన్న చేను ధ్వంసం చేశారు. బాధితురాలు ఓదెమ్మ ఫిర్యాదు మేరకు రవితోపాటు అతని కుటుంబ సభ్యులు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత



చిట్యాల: మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన పట్టేం శిల్ప ఇంటి ఎదుట సెల్‌ఫోన్ పెట్టి ఇంట్లోకి వెళ్లి వచ్చేసరికి సెల్‌ఫోన్ కనబడలేదు. దీంతో నవంబర్ 18న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి సెల్‌ఫోన్‌ను బాధితురాలు శిల్పకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సమ్మిరెడ్డి, కోమల, లాల్‌సింగ్, తదితరులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మొగుళ్లపల్లి: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మొగుళ్లపల్లికి చెందిన రావిచెట్టి మూగయా లక్ష్మి దంపతుల కుమారుడు రావిచెట్టి రాజు (28) అనే వ్యక్తి నూతన గ్రామపంచాయతీ భవనం వెనక వ్యవసాయ భూమిలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజుకు భార్య, ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. మృతికి గల పూర్తి వివరాలు తెలియ రాలేదు.

'అడవికి నిప్పు పెట్టొద్దు'

వాజేడు: అడవికి నిప్పు పెట్టొద్దని కోరుతూ బుధవారం మండల పరిధిలోని ఘణపురం, ఘణపురం కాలనీ గ్రామాల్లో అటవీ శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రేంజర్ బాలకృష్ణ మాట్లాడుతూ... ఇప్ప పువ్వులు సేకరించడానికి అడవిలోకి వెళ్లిన ప్రజలు చెట్ల కింద కూర్చుని నిప్పు పెడితే అడవిలో మంటలు చెల రేగి అడవికి నష్టం వాటిల్లుతుందని వివరించారు. తునికాకుకు నిప్పు పెట్టకుండా ప్రూనింగ్ చెయ్యడం వలన ఎక్కువ ఆకులు వస్తాయని చెప్పారు. శివరాజిరెడ్డి, చిన్నక్క, ఎఫ్‌బీఓలు లలిత, హతీరాం, ఆదిలక్ష్మి, వాసు పాల్గొన్నారు.

గింజ కొంటే ఒట్టు!



మార్కెట్ ఆవరణలోనే ఆరబోసిన ధాన్యం

- కాంటపెట్టలే.. గింజ పోలే
- ఇబ్బంది పడుతున్న రైతులు

చిట్యాల: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి పదిహేను రోజులు అవుతున్నా.. ఇంత వరకు కొనుగోలు ప్రారంభించలేదు. నవంబర్ 19న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాణరావు కేంద్రాన్ని ప్రారంభించినా ఇంత వరకు సంబంధిత అధికారులు గింజ కొన్న పాపాన పోలేదని రైతులు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అరబెట్టి రైతులు పడిగడుపులు కాస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షానికి ధాన్యం తడిస్తే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కొనుగోళ్ల ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు.

పట్టాలు, సంచులు ఇవ్వడం లేదు



మార్కెట్ ఆవరణలో వారం రోజులుగా వరి ధాన్యాన్ని అరబెట్టిన. అకాల వర్షాల మూలంగా ధాన్యం తడిస్తే ఎలా అని బయట కవర్‌ను కొనుక్కొని తెచ్చుకున్న. కనీసం కొనుగోలు సెంటర్‌లో పరదాలు ఇవ్వడం లేదు. ధాన్యం నింపేందుకు సంచులు లేవు. ఏ అధికారి ఇక్కడికి వచ్చి ధాన్యం కొన్న దిక్కేలేదు. అధికారులు స్పందించి ధాన్యం కొనాలి.

- ఓర్సు శ్రీనివాస్ రైతు చిట్యాల

విజయోత్సవ సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ: ఈనెల 8న జరిగే విజయోత్సవ సభను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే విజయోత్సవ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వనం రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు సూదనబోయిన ఓం ప్రకాశ్, కాటం సదయ్య, జోరు సుదర్శన్, ఈర్ల శ్యామ్, ప్రేమాజీ, ఓమాజీ, సాదు భిక్షపతి, వనం పోశాలు, పుట్ట రవి, దుమాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు హార్వెస్టర్ దగ్ధం



ప్రమాదవశాత్తు దగ్ధమవుతున్న హార్వెస్టర్

చిట్యాల: మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో ఓ రైతుకు చెందిన పొలంలో హార్వెస్టర్ వరి చేను కోస్తుండగా ప్రమాదవశాత్తు ఇంజన్ వేడెక్కి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్సై శ్రావన్‌కుమార్ హుటాహుటిన ఘటనా స్థలాన్ని సందర్శించారు. సిబ్బంది, స్థానికుల సాయంతో మంటలను ఆర్పివేశారు. కాగా డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



విద్యార్థుల న్యాస్ పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ రాజు



కాటారం: పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

రేగొండ (కొత్తపల్లిగోరి): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని మండల విద్యాధికారి రాజు అన్నారు. బుధవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే కోసం చైతన్య భారతి పాఠశాలలోని మూడో తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జామ్ సెంటర్‌ను ఎంఈఓ పరిశీలించారు. న్యాస్ పరీక్ష ఆధారంగానే మండలంలో విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయనేది నిర్ధారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సెంటర్ అబ్జర్వర్ పీపీ గిరిధర్ కృష్ణ, సీఆర్‌పీ సహదేవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పకిడే కిరణ్, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ పాల్గొన్నారు.

కాటారం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీయడంలో భాగంగా బుధవారం మండలంలోని పలు పరీక్షా కేంద్రాల్లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పరీక్ష నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షకు హాజరై తమ ప్రతిభ కనబర్చారు. మండల విద్యాధికారి శ్రీదేవి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పరీక్ష కొనసాగుతున్న తీరుపై ఆరా తీశారు. ఎంఈఓ వెంట ఎంఐసి కోఆర్డినేటర్ గద్దల సుదర్శన్ ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, హామీలను అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. రైతులు, విద్యార్థులు, మహిళలను మోసం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నెతో పెట్టిన విద్య అని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, మండల నాయకులు నాగపూరి రాజమొగిలి, మోరె రవీందర్‌రెడ్డి, తీగల జగ్గయ్య, మైదం శ్రీకాంత్, స్వామి, మాచర్ల రఘు, గుండ మనికుమార్, గుండా సురేష్, చెక్క నర్సయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్ల: బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రానున్న రోజుల్లో బీజేపీదే అధికారం

టేకుమట్ల: రాష్ట్ర ప్రజలు రానున్న రోజుల్లో బీజేపీకి అధికారం కట్టబెట్టడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చిందని, పదేళ్ల పాలనలో అమలు కాని ఎన్నో హామీలున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సైతం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేసారు. మండల అధ్యక్షుడు దేశెట్టి గోపాల్, సీనియర్ నాయకులు కూర సురేందర్‌రెడ్డి, బిక్కినేని సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శులు గుర్రపు నాగరాజు, బండారి సమ్మయ్య, జిల్లా నాయకులు దుగ్యాల రాంచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బైకు ర్యాలీని విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: నేడు (గురువారం) బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న బైక్ ర్యాలీని కార్యకర్తలు ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ర్యాలీ ఉదయం 8 గంటలకు గణపురం మండలం చెరువు కట్ట దగ్గర నుంచి ధర్మరావుపేట, బసవరాజు, గొల్లపల్లి, చెల్పూరు మీదుగా భూపాలపల్లి రూరల్ కొంపెల్లి, గొర్లవీడు, భూపాలపల్లి అర్బన్ కాసీంపల్లి, సెగ్గంపల్లి, జంగేడు, కాకతీయ కాలనీ, శాంతినగర్ మీదుగా భూపాలపల్లి చేరుకుటుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బట్టు రవి, జిల్లా నాయకులు దొంగల రాజేందర్, రామ్ రెడ్డి, నాంపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీకి ఘన సన్మానం



ఆర్‌ఎంపీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మహేందర్, తదితరులు

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టి)కి చెందిన నూతి శ్రీనివాస్ అనే ఆర్‌ఎంపీ మూడు దశాబ్దాలుగా సేవలందిస్తున్నందుకు బుధవారం మాజీ సర్పంచ్ గునిగంటి మహేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా గ్రామంలో నిరంతరం ప్రజలకు ప్రాథమిక వైద్యాన్ని అందిస్తూ ఎంతో మంది మన్ననలను పొందుతున్నాడని కొనియాడారు. ఆయన సేవలకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో సైతం ఆయన సేవలు గ్రామ ప్రజలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మల దేవేందర్, హరిఓం రాజు, వరికెల కిష్టారావు, బందెల దేవేందర్, నర్సయ్య, కొడగాని నవీన్, మడిపోజు సదయ్య, ఇండ్ల తిరుపతి, వివేకానంద, సాద సాయి, మొబిన్ పాల్గొన్నారు.

నియామకం



క్రాంతి

రేగొండ: మండల కాంగ్రెస్ యువజన పార్టీ అధ్యక్షుడిగా కోయిల క్రాంతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఓట్లు వేసిన యువజన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బట్టు కర్ణాకర్



బట్టు కర్ణాకర్, యువజన జిల్లా అధ్యక్షుడు



ఉమేష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా బట్టు కర్ణాకర్ నియామకంపై భూపాలపల్లి యువజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఉమేష్‌రెడ్డికి పలువురు అభినందలు తెలిపారు.

ఎన్నిక



అనిల్

టేకుమట్ల: ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఆన్‌లైన్ ఎన్నికల ఫలితాలను బుధవారం వెల్లడించారు. ఈనేపథ్యంలో టేకుమట్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కొలుగూరి అనిల్ భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పటిష్టత కోసం కష్టపడి పని చేసానని, భవిష్యత్‌లో పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో మరింత పని చేస్తానన్నారు.

పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలి

- డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రవీందర్



దీక్షలో పాల్గొన్న ధర్మ సమాజ్‌పార్టీ నాయకులు

భూపాలపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరుతూ.. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బుధవారం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తూరి రవీందర్ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ ఆదేశానుసారం తెలంగాణలో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లకు మండలాల అధికారులకు వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేనందున మరోసారి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ధర్మ సమాజ్ పార్టీ రిలే నిరాహార దీక్షలు చేపట్టిందన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని, ప్రతి గ్రామంలో అత్యాధునిక స్కూల్, కళాశాల నిర్మించాలని, ప్రజలందరికీ ఉచిత నాణ్యమైన వైద్యాన్ని అందించాలని డిమాండ్‌తో దీక్షలు కొనసాగిస్తామని రవీందర్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి, జిల్లా కమిటీ నాయకులు చెన్నూరి నరసింహ, ఓంకార్, బండారి దశరథం, మోకిడి అశోక్, అంతదుపుల సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న అయిలయ్య, చేరాలు మిత్రులు

చిట్యాల: రేగొండ మండలం రేపాక గ్రామానికి చెందిన పొనగంటి చేరాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతనితో చిట్యాల హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న (1994–95 బ్యాచ్) మిత్రబృందం బాధిత కుటుంబానికి రూ.40 వేలను మాజీ ఏంఈఓ పగడాల అయిలయ్య చేతుల మీదుగా అందజేశారు. కాగా గత రెండు సంవత్సరాల క్రితం తల్లి, ఇటీవల తండ్రి మృతి చెందడంతో ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మిగిలారు. దీంతో అతనితో చదువుకున్న మిత్ర బృందం సభ్యులు ఆ ఇద్దరు ఆడ పిల్లలను ఓదార్చారు. కార్యక్రమంలో పదో తరగతి 1994–95 బ్యాచ్ అధ్యక్షుడు తోటకూరి భాస్కర్, ప్రధాన కార్యదర్శి క్యాతం రాజేందర్, కోశాధికారి బుర్ర తిరుపతి, ప్రచార కార్యదర్శి మండల సత్యం, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, మిత్ర బృందం సభ్యులు గుర్రపు తిరుపతి గౌడ్, చిలుకల సదానందం, ముత్యాల సాంబయ్య, పొనగంటి శ్రీనివాస్, గుర్రం చందు తదితరులు పాల్గొన్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ: ఇద్దరికి గాయాలు





ప్రమాదంలో ధ్వంసమైన ట్రాక్టర్, కారు

టేకుమట్ల: కారు, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని గర్మిళ్లపల్లి శివారులో బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన లింగంపెల్లి రామారావుకు చెందిన ట్రాక్టర్ మానేరుకు వెళ్తుంది.. మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇప్పకాయల రాజేశ్ టేకుమట్ల వైపు కారులో వస్తుండగా గర్మిళ్లపల్లి శివారులో ప్రమాదవశాత్తు రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులో ఉన్న రాజేష్, ట్రాక్టర్‌పై ఉన్న దుబ్యాల గ్రామానికి చెందిన గొసిగంటి ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇరువురు వాహనదారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై దాట్ల కుమారస్వామి తెలిపారు.

పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్



స్లాప్‌లో పాఠాలు వింటున్న విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండల వ్యాప్తంగా తరగతి గదులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఇప్పలపల్లిలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు కనీసం తరగతి గదులు లేకుండా ఓపెన్ స్లాబ్‌లలో క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తరగతి గదులు లేని పాఠశాలలకు వెంటనే అనుమతులను రద్దు చేయాలన్నారు. చిన్న పిల్లలను ఇసుకలో కూర్చోపెట్టి కనీసం బోర్డు కూడా లేకుండా తరగతులు నిర్వహించడం సరికాదన్నారు. సంబంధిత అధికారులు శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రేణుకుంట్ల ప్రవీణ్ కోరారు.

బాలికలకు వివాహం చేయొద్దు

కన్నాయిగూడెం: బాలికలకు వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ నరేష్ అన్నారు. మండలంలోని గూర్రేవుల జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్ హాజరై మాట్లాడారు. మైనర్ బాలికలు మిడిమిడి వయసులో తాళి కట్టించుకొని జీవితాన్ని బంది చేసుకోవద్దన్నారు. మైనర్ పిల్లలు వారి హక్కులపై అవగాహనతో ఉండాలన్నారు. ఉత్తమ లక్ష్యం కోసం చదివు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. బాల్య వివాహాలు చేయడానికి కుటుంబాలు పూనుకుంటే 1098 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలని లేదా.. 100కు డయల్ చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపయ్య, ఉపాధ్యాయులు జమున, కుమార్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెనూ పాటించాలి

- ఐటీడీఏ డీడీ పోచం

ఎస్ఎస్‌తాడ్వాయి: పాఠశాలల్లో మెనూ పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ డీడీ పోచం ఆదేశించారు. మండల పరిధిలోని కొడిశాల ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని డైనింగ్ హాల్, వంట గదులు, స్టాక్ రూంను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడంతో పాటు వేడి ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. వంట పాత్రలు, షెడ్ శుభ్రంగా ఉంచుకోవాలని వర్కర్లకు సూచించారు. నాణ్యమైన కూరగాయలు, వంట సరుకులు ఉపయోగించాలని, విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు జ్వరం భారిన పడితే పక్కనే ఉన్న పీహెచ్‌సీకి తీసుకెళ్లాలని ఏఎన్ఎం సుధారాణికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పదో తరగతిలో వందశాతం ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం దేవదాస్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ చందా కోటేశ్వరరావు, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ యాలం ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



అంత్యక్రియలకు తరలిస్తున్న వానర కలేబరం

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు వానరం మృతిచెందింది. దీంతో కోతులదండు వానర కలేబరం వద్దకు చేరుకుని కొద్దిసేపటి వరకు అరిచాయి. కోతి కలేబరం వద్దకు కాలనీవాసులు రాకుండా కోతులు గుంపుగా అడ్డుకున్నాయి. కానీ, కర్రలతో వాటిని చెదరగొట్టి సంప్రదాయబద్ధంగా డప్పు చప్పుళ్లతో బాణాసంచా కాల్చి గ్రామపంచాయతీ ట్రై సైకిల్ ద్వారా తీసుకెళ్లి వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈక్రమంలో మూగజీవి మృత్యువాత పడడంతో పలువురు కాలనీవాసులు కన్నీళ్లు పెట్టుకున్నారు.